# సాక్షి సూర్యాపేట

మంగళవారం • 6 • ఫిబ్రవరి • 2024






**పురుగుల మందు డబ్బాతో..**
భూ సమస్య విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మహిళ పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చింది. - 8లో



**మనోధైర్యం కోల్పోవద్దు**
దివ్యాంగులు మనోధైర్యం కోల్పోవద్దని రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 10లో



**వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి**
భువనగిరిలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో

## న్యూస్‌రీల్

### రేపు 100 పడకల వైద్యశాలకు శంకుస్థాపన

**కోదాడ:** కోదాడ పట్టణంలో ఉన్న 30 పడకల వైద్యశాలను వంద పడకల వైద్యశాలగా మార్చ డానికి ఇదివరకే ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. దీనిలో భాగంగా ఈ నెల 7న రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావులు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మంత్రులు కోదాడకు రానున్నారు. వైద్య ఆరోగ్యశాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు.

**రేపు హుజూర్‌నగర్‌కు మంత్రులు**

**హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్‌కు ఈ నెల 7న ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్‌రెడ్డి రానున్నారు. ఈ విషయాన్ని ఉత్తమ్ క్యాంపు కార్యాలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో సిబ్బంది, సౌకర్యాలపై పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మంత్రులు రివ్యూ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

### జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన శ్వేతకు సన్మానం



శ్వేతను సన్మానిస్తున్న న్యాయవాదులు

**చివ్వెంల(సూర్యాపేట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యురాలు భానోతు శ్వేతను సోమవారం బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులు పుష్ప గుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, బాగాల నర్సింహ, జె. శశిధర్, ఉమాపతి, వెంకట్ రెడ్డి, ధరావతు వీరేష్ నాయక్, సీహెచ్. శ్రీనివాస్, వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, పిట్టల వెంకటేశ్వర్లు , న్యాయవాదులు పాల్గొన్నారు.

### ఎంపీడీఓ విజయ శ్రీ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

**కోదాడరూరల్ :** మండల పరిషత్ నిధులు దుర్వినియోగం చేయడమే కాకుండా పలు అక్రమాలకు పాల్పడ్డారని కోదాడ ఎంపీడీఓగా పనిచేసిన విజయశ్రీని సోమవారం సస్పెండ్ చేశారు. ఈమేరకు పంచాయతీ రాజ్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిషత్‌లో అక్రమాలపై విచారణ చేసిన అధికారులు నెలరోజులు గడుస్తున్నా ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడంపై 'నిజాలు నిగ్గుతేలేనా' అనే శీర్షికన గత నెల 28న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. కోదాడ ఎంపీడీఓతో పాటు నాటి ఎంపీపీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని పాలకవర్గ సభ్యులు గత ఏడాది డిసెంబర్19న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన ఆయన విచారణకు ఆదేశించగా అదే నెల 21 స్థానిక ఆర్డీఓతో పాటు జెడ్పీ సీఈఓ, డీపీఓ కలిసి విచారణ ప్రారంభించారు. రూ.28,45,169 నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులు ప్రాథమిక విచారణలో తేల్చారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. విచారణలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలడంతో ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు పంచాయతీరాజ్ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆమె నాలుగు రోజులు కిందట జిల్లాలోని జాజిరెడ్డిగూడేనికి బదిలీకాగా అక్కడి ప్రజాప్రతినిధులు విధుల్లో చేరకుండా అడ్డుకున్నట్లు తెలిసింది.

**కోదాడ ఏడీఏ వాసు కూడా..**

కోదాడ వ్యవసాయ సంచాలకుడు(ఏడీఏ) టి.వాసుపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. తన వ్యవసాయ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మోతె మండల మహిళా ఏఓను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆమె గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు ఏడీఏను సస్పెండ్ చేస్తూ శనివారం వ్యవసాయశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నడిగూడెం ఏఓ రాజగోపాల్‌కు ఇన్‌చార్జ్ ఏడీఏగా బాధ్యతలు అప్పగించారు.

### బీఈడీ పరీక్షల షెడ్యూల్ విడుదల

**నల్లగొండ రూరల్ :** మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, బీపీఈడీ పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి విడుదల చేశారు. బీఈడీ, బీపీఈడీ కోర్సుల 3వ సెమిస్టర్, స్పెషల్ ఎడ్యుకేషన్ 2వ సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ టైం టేబుల్‌ను విడుదల చేశారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పరీక్షల టైంటేబుల్ ఉన్నట్లు పేర్కొన్నారు.

# ఎస్‌డీఎఫ్ వచ్చే..!

**నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధులు**

- జిల్లాకు రూ.40కోట్లు మంజూరు
- పాఠశాలలకు 20శాతం.. తాగునీటికి 10శాతం
- కార్యాలయాల నిర్వహణకు 5శాతం
- మిగతా 65శాతం సంక్షేమ, అభివృద్ధి పనులకు..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో ఖర్చు చేయాలని ఉత్తర్వులు జారీ



**తిరుమలగిరి(తుంగతుర్తి):** రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు(ఎస్‌డీఎఫ్) కేటాయించింది. ఒక్కో నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున మంజూరు చేసింది. జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు కలిపి రూ.40 కోట్లు విడుదల చేసింది. వీటి వినియోగంపై మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతితోనే ఎస్‌డీఎఫ్ ఖర్చు చేయాలని ఉత్తర్వులుల్లో పేర్కొనడమే గాక కొత్త పనులకు వినియోగించాలని సూచించింది. రూ.10కోట్లలో 20శాతం అంటే రూ.2కోట్లు విద్యారంగంలో మౌలిక వసతుల కల్పనకు, 10శాతం అంటే కోటి రూపాయలు తాగునీటి సౌకర్యానికి, మరో 5శాతం అంటే రూ.50లక్షలు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వినియోగించాల్సి ఉంటుంది. ఇవిపోను మిగతా 65 శాతం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేసేందుకు ఎమ్మెల్యేలకు వీలు కల్పించింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నియోజకవర్గాల్లో కొత్తగా చేపట్టాల్సిన పనులను గుర్తించే పనిలో పడ్డారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి**

ఎస్‌డీఎఫ్‌లో 20శాతం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి వినియోగించనున్నారు. ప్రస్తుతం ఉన్న బడులను బలోపేతం చేయడం, శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను మరమ్మతు చేయడం, ప్రహరీల నిర్మాణం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంట గదుల నిర్మాణం, క్రీడా సామగ్రి కొనుగోలు తదితర అభివృద్ధి పనుల కోసం కేటాయించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ బడి కోసం ఖర్చు చేసేందుకు రూ.2కోట్లు కేటాయించారు. ఇందు కోసం విద్యాశాఖలోని ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఎక్కడెక్కడ నిధులు అవసరమో మండలాలవారీగా నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అసౌకర్యం లేకుండా విద్యా బోధన జరిగేలా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది.

**తాగునీటికి కేటాయింపు**

ఈ నిధుల్లో పదిశాతం తాగునీటికి కేటాయించింది. ప్రతి నియోజకవర్గంలో రూ.కోటి నిధులు ఖర్చు చేయనుంది. ఈ నిధులతో గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధానంగా చేతి పంపుల మరమ్మతులు, నల్లాల లీకేజీలు, పైప్‌లైన్ నిర్మాణం, మంచి నీటి బావుల పూడికతీత లాంటి పనులు చేపట్టనున్నారు. అయితే ఇప్పటికే చాలా ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా నీళ్లు వస్తున్నాయి. లీకేజీలతో తాగునీటి కోసం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మిషన్ భగీరథ నీళ్లు రాని ప్రాంతాలకు కొత్తగా నీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు రూ.50 లక్షల నిధులను వినియోగించనున్నారు. మండలస్థాయి, ప్రభుత్వ కార్యాలయాల నుంచి కలెక్టరేట్ వరకు ఈ నిధులను ఖర్చు చేస్తారు. కార్యాలయాల మరమ్మతులతో పాటు ఇతర సామగ్రి కొనుగోలు, నిర్మాణాలకు ఈ నిధులను ఖర్చు చేసే అవకాశముంది.

**ఇన్‌చార్జి మంత్రి అనుమతితో పనులు**

జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఎస్‌డీఎఫ్ కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వారి పరిధిలో చేపట్టనున్న పనుల వివరాలను ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్‌డీఎఫ్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతితో ఖర్చు చేయనున్నారు. కలెక్టర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రణాళిక శాఖకు పంపనున్నారు. ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయగానే నిధులు విడుదల చేయనున్నారు.

**ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను భారీగా పెంచింది. రూ.10 కోట్లతో పాఠశాలలతో పాటు గ్రామాల్లో నీటి సమస్యలు తీరనున్నాయి. రూ.10 కోట్ల నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పనుల కోసం అధికారులకు పంపుతాం.

– మందుల సామేల్, తుంగతుర్తి ఎమ్మెల్యే

# తాగునీటి సమస్య రాకుండా చూడాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్

- కలెక్టర్ వెంకట్రావు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ వెంకట్రావు సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డిలతో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.10కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో నుంచి ప్రస్తుతం అత్యవసర పనులకు నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున వాడుకోవచ్చని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాభావం వల్ల నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, ప్రత్యేక ప్రణాళికతో దానిని అధిగమించాలన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న పనులను పంచాయతీ నిధుల నుంచి వాడుకోవాలన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు ఫిబ్రవరి 29వ తేదీ నాటికి ఎఫ్‌టీఓలు జనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల్లో జరిగే అభివృద్ధి పనులను ఎంపీడీఓలు పరివేక్షించాలన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ సమావేశాలు జరిగినప్పుడు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని, సమావేశాలకు రాని అధికారుల వివరాలను ఎంపీడీఓలు తెలియజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తుల వివరాలను శాఖల వారీగా తెలిపారు. వీటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పరిశ్రమలశాఖ జీఎం తిరుపతయ్య పీఎం విశ్వకర్మ యోజన గురించి వివరించారు.

**ప్రజావాణిలో 55 దరఖాస్తులు**

ప్రజావాణిలో వివిధ సమస్యలపై 55 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. వీటిలో తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి 26, ఆర్డీఓ కార్యాలయాలకు సంబంధించి 4, వివిధ శాఖలకు చెందినవి 25 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డిడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీసీడీడీఓ దయానందరాణి , కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి , డీటీడీఓ శంకర్, డీఈఓ అశోక్, డీఏఓ రామారావు నాయక్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా సర్వే అధికారి నాగేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జీఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, ఉపాధి కల్పన అధికారి ఎస్. మాధవరెడ్డి, జిల్లా పశువైద్యాధికారి డి. శ్రీనివాస్, జిల్లా కోశాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి



సూర్యాపేటలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

**సూర్యాపేట :** మాజీ సీఎం కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణమే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం సూర్యాపేటలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు కారకుడైన కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రుణమాఫీ, రైతుబంధు ఇవ్వకుండా కాలయాపన చేసేందుకు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, ఆకుల లవకుశ, పెద్దగట్టు ఆలయ చైర్మన్ సైదులు, సయ్యద్, భరత్ పాల్గొన్నారు.

### సూర్యక్షేత్రంలో జ్యోతి దర్శనం



**అర్వపల్లి:** జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం లోని సూర్య క్షేత్రంలోని గర్భాలయం గోడపై సోమవారం జ్యోతి దర్శనమిచ్చింది. ఏటా రథసప్తమికి ముందు సూర్యనారాయణస్వామి గర్భాలయంపై ఇలా జ్యోతి రూపంలో దర్శనమిస్తుందని సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి తెలిపారు. కాగా రథసప్తమి రోజున గర్భాలయంలో సూర్యనారాయణస్వామి పాదాలను సూర్యకిరణాలు తాకనున్నాయి.

### ఎఫ్‌ఎల్‌సీని పకడ్బందీగా నిర్వహించాలి



గోదాంలో సీల్ తొలగిస్తున్న అధికారులు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ ( ఎఫ్ఎల్‌సీ)ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సీని అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఎ. వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. 13 మంది ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో ఈ నెల 14 వరకు 1,867వీవీ ప్యాట్స్, 2,811 బ్యాలెట్ యూనిట్లు 1,747 కంట్రోల్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు కృష్ణయ్య, సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి, తహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా పనిచేయాలి

- అదనపు కలెక్టర్ ప్రియాంక



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీలకు నియమించిన ప్రత్యేక అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, హరితహారం, ఇంటి పన్ను వసూలు, లైటింగ్, ఉపాధి పనులు, జాబ్ కార్డుల జారీ , పచ్చదనం , రికార్డుల నిర్వహణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీపీఓ యాదయ్య, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారులు సాంబిరెడ్డి, శ్రీరాములు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు,అధికారులు పాల్గొన్నారు.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**భానుపురి (సూర్యాపేట) :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జ్యోతిపద్మ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ చైతన్య, బ్యూటీషియన్ శిక్షకురాలు కవిత, రేవతి, వినోద్, తేజస్విని, భవ్య తదితరులు పాల్గొన్నారు.

# చేతి వృత్తుల వారికి చేయూత

- పీఎం విశ్వకర్మ యోజన ద్వారా రూ.3లక్షల రుణం
- 5శాతం వడ్డీకే మూడు విడతల్లో అందజేసేలా రూపకల్పన
- తొలుత 18 సంప్రదాయ వృత్తుల ఎంపిక
- సీఎస్‌సీల ద్వారా దరఖాస్తుల ఆహ్వానం
- అవగాహన కల్పిస్తే సుమారు లక్ష కుటుంబాలకు లబ్ధి



**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** సంప్రదాయ చేతి వృత్తుల వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పీఎం విశ్వకర్మ యోజనను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకాన్ని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రకటించగా సెప్టెంబర్ 17న ప్రారంభించారు. ఈ పథకం కింద 5 శాతం వడ్డీకే రూ. 3 లక్షల వరకు రుణ సదుపాయం పొందే అవకాశం ఉంది. సంప్రదాయ వృత్తులు, చేతి వృత్తుల్లో పని చేసే వెనుకబడిన వర్గాల అభ్యున్నతే పీఎం విశ్వకర్మ యోజన పథకం ముఖ్యం లక్ష్యం. ఈ స్కీమ్ 2023–24 నుంచి 2027–28 వరకు అయిదేళ్ల పాటు అమలులో ఉండనుంది. ఈ పథకంతో జిల్లాలో సుమారు లక్ష కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. దీనిపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.

**పథకం అమలు ఇలా..**

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్‌తో పాటు గుర్తింపు కార్డు అందిస్తారు. అలాగే, తొలి విడత కింద రూ. లక్ష వరకు రుణం ఇస్తారు. ఈ రుణాన్ని పొందిన వారు తిరిగి 18నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. వీరికే రెండో విడత కింద రూ. 2 లక్షల రుణం ఇస్తారు. వీటిని కూడా 18 నెలల్లో తిరిగి చెల్లించాలి. క్రమం తప్పకుండా రెండు విడతల్లో కూడా తీసుకున్న రుణం చెల్లించినవారికి మూడో విడతలో రూ.3 లక్షల రుణం ఇస్తారు. దీనికి కేవలం 5 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇది ఇతర లోన్లతో పోలిస్తే చాలా తక్కువని చెప్పాలి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కళాకారులు, చేతి వృత్తుల వారికి ఈ స్కీమ్ వర్తిస్తుంది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు రోజుకు రూ. 500 ఇస్తూ 5 రోజులు ప్రాథమిక శిక్షణ ఇస్తారు. అదే విధంగా మరో 15 రోజులు అడ్వాన్స్ శిక్షణ ఇచ్చి టూల్ కిట్‌కు రూ. 15 అందిస్తారు. తొలుత 18 సంప్రదాయ వృత్తులకు ఈ స్కీమ్ ప్రయోజనాలు అందనున్నాయి.

**దరఖాస్తు ఇలా..**

ఎంపిక చేసిన వృత్తులకు చెందిన వారు కామన్ సర్వీస్ సెంటర్ ( సీఎస్‌సీ) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. దరఖాస్తుకు చివరి తేదీ లేదు. అయితే ఈ పథకంపై ప్రజల్లో పెద్దగా అవగాహన లేదు. అర్హులకు లబ్ధి చేకూరాలంటే అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.

**వర్తించేది వీరికే..**

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో ముందుగా 18 సంప్రదాయ వృత్తులను ఎంపిక చేశారు. వీరిలో కమ్మరి, వడ్రంగి, కుమ్మరి, స్వర్ణకారులు, చర్మకారులు, రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు, శిల్పులు/రాళ్లు పగులగొట్టేవాళ్లు, తాళాలు రిపేర్ చేసేవాళ్లు, మేస్త్రీలు, బుట్టలు/చీపుర్లు/మ్యాట్ల తయారీదారులు, బొమ్మల తయారీదారులు, పూలదండలు అల్లేవారు, చేపల వలలు తయారుచేసేవారు, పడవల తయారీదారులు, హ్యామర్, టూల్ కిట్ మేకర్లు, చిన్న చిన్న ఆయుధాలు తయారుచేసే వారున్నారు.

# నాయకులను విడుదల చేయాలి



ఖమ్మం సీపీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** ఖమ్మంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నాయకులపై పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, బేషరతుగా విడుదల చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట లో అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో ఖమ్మం సీపీ దిష్టి బొమ్మ దహనం చేసి మాట్లాడారు. ఖమ్మంలో పార్టీ జాతీయ మహాసభల సందర్భంగా ప్రచారం చేస్తున్న రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, పుల్లయ్యలతో పాటు ఏడుగురిని అక్రమంగా అరెస్ట్ చేసి, రౌడీ షీట్ ఓపెన్ చేసి జైలుకు పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య, అరుణోదయ జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, భూక్యా రాంజీ, మారసాని చంద్రకళ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- ఎస్పీ రాహుల్‌హెగ్డే



మునగాలలో జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్ పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

**మునగాల(కోదాడ):** రోడు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం ఆయన మునగాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలించారు . మాధవరం, మొద్దులచెరువు, కలకోవస్టేజీ, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల స్టేజీల వద్ద రోడ్డు స్థితిగతులను పరిశీలించారు. తరచూ జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలపై చర్చించి నివారణ చర్యలు చేపట్టాలని పోలీస్ యంత్రాంగానికి సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎన్‌హెచ్‌ఏఐ, జీఎమ్మార్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జంక్షన్ల వద్ద ఉన్న ఇంజనీరింగ్ లోపాలను గుర్తించి సరిచేయాలన్నారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్, మునగాల సీఐ పి.వీరరాఘవులు, లోకేష్, జీఎమ్మార్ అధికారులు రాజేంద్రకుమారి, నాగకృష్ణ పాల్గొన్నారు.

**ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు**

**సూర్యాపేట క్రైం:** పోలీస్ ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ రాజేష్ మీనా పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బాలికల ఉన్నత పాఠశాలలో విచారణ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కళారాణి

**నడిగూడెం :** నడిగూడెం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు ఇటీవల డీఈఓ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి కార్యాలయం అధికారిణి కళారాణి సోమవారం పాఠశాలలో విచారణ జరిపారు. నివేదికను విద్యాధికారికి ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

### వీడని హత్య కేసు మిస్టరీ

**కేతేపల్లి:** కేతేపల్లి మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో వ్యవసాయ కూలీ వంటల సైదులు హత్యకు గురై మూడు రోజులు కావస్తున్నా కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. ఈనెల 3న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సైదులును దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. గ్రామంలో ఓ వివాహితతో సైదులు వివాహేతర సంబంధం పెట్టుకున్న కారణంగానే ఈ హత్య జరిగిందనే కోణంలోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. హత్య జరిగిన మరుసటి రోజే అనుమానిత మహిళతో పాటు ఆమెకు సంబంధించిన మరో కుటుంబ సభ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. దీంతో పాటు ఈ హత్యలో అనుమానిత కుటుంబ సభ్యులే కాకుండా ఇతరుల ప్రమేయం ఏమైనా ఉన్నదా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

### పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 31 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. దయానందరాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులుhttps://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### యువకుడు అదృశ్యం

**గుర్రంపోడు :** ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. గుర్రంపోడుకు చెందిన షేక్ షరీఫ్ (25) ఇటీవల తల్లిదండ్రులతో కలసి జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లాడు. షరీఫ్‌కు మతిస్థిమితం లేదు. దర్గా వద్ద తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తెలుపు కలర్, 5.3 అంగులాల ఎత్తు ఉంటాడని, కనిపిస్తే 80087 85964 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

# ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

- 4.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితుల వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే


మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

**మునగాల(కోదాడ):** ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4.5కిలోల గంజాయితో పాటు రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే నిందితుల వివరాలు వెల్లడించారు. సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన మెంతబోయిన గణేష్, చివ్వెంల మండల కేంద్రానికి చెందిన జాకటి కార్తీక్, మోతె మండలం రావిపహాడ్‌కు చెందిన వంటమాస్టారు ఎలుగు మహేష్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా గంజాయిని విక్రయిస్తున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒడిశా సరిహద్దులోని అంబాద గ్రామంలో కిలో రూ.5వేలకు గంజాయిని కొనుగోలు చేసి సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అంబాద గ్రామం నుంచి 4.5 కిలోల గంజాయిని కొనుగోలు చేసిన ముఠా సభ్యులు సూర్యాపేటకు బైక్‌లపై బయలుదేరారు. ఆదివారం ఖమ్మం జిల్లా మామిళ్లగూడెం వద్ద పోలీసు చెక్‌పోస్టు ఉండడంతో కోదాడ మీదుగా సూర్యాపేటకు వెళ్తున్నారు. మార్గమధ్యలో మునగాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొద్దులచెరువు స్టేజీ వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా గంజాయి రవాణా విషయం వెలుగుచూసింది. నిందితులపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ వివరించారు.

**గంజాయి రవాణాపై నిఘా పెంచాం**

జిల్లాలో గంజాయి రవాణా, వినియోగించే వారిపై నిఘా పెంచామని ఎస్పీ తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి రవాణా చేస్తున్న నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ వీరరాఘవులు, మునగాల, మోతె పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు పి.లోకేష్, వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐలు మల్సూర్, నాగేశ్వరరావు, సిబ్బంది సుధీర్‌కుమార్, రవికుమార్, వెంకటేశ్వర్లు, రాంబాబు, పుల్లారావు, బాలు, ఈశ్వర్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు..

- మహిళను కార్యాలయం గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు
- భూ సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదన


పురుగుల మందు డబ్బా తీసుకున్న హోంగార్డు, చిత్రంలో బాధితురాలు పూలమ్మ

**దురాజ్‌పల్లి(సూర్యాపేట) :** భూ సమస్యను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఓ మహిళ సోమవారం పురుగుల మందు డబ్బాతో సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చింది. గేటు వద్దనే పోలీసులు సదరు మహిళను గుర్తించి పురుగుల మందు డబ్బాను తీసుకోవడంతో ప్రమాదం తప్పింది. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన సుంకిరెడ్డి సుశీలమ్మకు గ్రామంలోని 17, 19, 21 సర్వే నంబర్లలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 50 సంవత్సరాలుగా సుశీలమ్మ కుటుంబ సభ్యులే భూమిని సాగు చేసుకుంటున్నారు. 2012వ సంవత్సరంలో మూడు ఎకరాల భూమి సుశీలమ్మ పేరిట రిజిస్ట్రేషన్ కాగా నేటికీ పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదు. తన తల్లి పేరిట భూమిని పట్టా చేసి పాస్‌పుస్తకం అందించాలని కొన్ని నెలలుగా సుశీలమ్మ కూతురు చివ్వెంల మండలం గుంపుల గ్రామానికి చెందిన నాతాల పూలమ్మ కోరుతోంది. ఈ విషయంపై గతంలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా భూమిని పరిశీలించి పట్టా చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించినట్లు బాధితురాలు పేర్కొంది. అయినా మండల రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, అందుకే ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందు తెచ్చుకున్నట్లు పూలమ్మ చెప్పింది. దీనిపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ భూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజలకు రక్షణ కల్పించేందుకే కార్డెన్ సెర్చ్


పెంచికల్‌దిన్నలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి

**నేరేడుచర్ల :** అసాంఘిక శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకే కార్డెన్ సెర్చ్ (నిర్బంధ తనిఖీలు) నిర్వహిస్తున్నట్లు హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి పేర్కొన్నారు. నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో సోమవారం తెల్లవారుమున పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సంఘ విద్రోహశక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాడుతూ ప్రజా జీవనాన్ని ఇబ్బందులను గురి చేసే వారిని గుర్తించేందుకే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద శక్తులు సంచరిస్తే పోలీసులు, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో ఐదుగురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఏడుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**కోదాడ రూరల్ :** అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను రూరల్ పోలీసులు సోమవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. కోదాడ మండలంలోని మంగళితండా వద్ద గల పాలేరు వాగు నుంచి కోదాడకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకొని డ్రైవర్, ఓనర్ అయిన మార్కపూడి కమలాకర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### 18మందిపై కేసు

**భువనగిరి క్రైం:** ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని భువనగిరిలో ఆదివారం నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న 18మందిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వీరిలో బీఎస్పీ, బీఆర్‌ఎస్, బీజేపీ, ఐద్వా నాయకులు భట్టు రామచంద్రయ్య, ఏవీ కిరణ్‌కుమార్, రత్నపురం బాలరాజు, అనురాధ, అయోధ్యాయాదవ్, ఇమ్రాన్‌తో పాటు 12మంది ఉన్నారని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

### 8న స్వచ్ఛంద సంస్థల మీట్

**సూర్యాపేటటౌన్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈ నెల 8వ తేదీన తెలంగాణ ఎన్జీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల మీట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్‌కు కలిసి పనిచేద్దాం–యువతకు చేయూతనిద్దాం' అనే అంశంతో నిర్వహించే ఈ మీట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి జిల్లాకు రెండు స్వచ్ఛంద సంస్థలకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గలవారు 9441163949 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాగిరెడ్డి, జ్ఞానేశ్వర్, నాగరాజు, రాజలింగం, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కారు డ్రైవర్‌కు ఆరునెలల జైలు శిక్ష

**కట్టంగూర్ :** ఇద్దరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు సోమవారం నకిరేకల్ కోర్టు మేజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామానికి చెందిన మాగి భిక్షం, కోనేటి యాద య్య, సుంకరబోయిన వెంకన్నల 2015వ సంవత్సరం మే 20వ తేదీన బైక్‌పై నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని పామనగుండ్ల సబ్‌స్టేషన్ వద్దకు రాగానే హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డ్రైవర్ వడ్లపల్లి చిదానంద అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భిక్షం, యాదయ్య అక్కడికక్కడే మృతిచెందగా వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు భిక్షం కుమారుడు ప్రకాశ్ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నకిరేకల్ మెజిస్ట్రేట్ సోమవారం కారు డ్రైవర్‌కు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

## లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు, జరిమానా

**చివ్వెంల(సూర్యాపేట) :** ఒకరి మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు కింది కోర్టు ఇచ్చిన తీర్పును అమలు పరుస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సోమవారం తీర్పు వెల్లడించారు. కోదాడ పట్టణానికి చెందిన మాలోతు ఉపేందర్ 2016 సంవత్సరం ఆగస్టులో తన మోపెడ్‌పై కటింగ్ షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కోదాడ నుంచి మిర్యాలగూడ వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో ఉపేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి నాగేశ్వర్‌రావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన లారీడ్రైవర్ అద్దంకి చిన్నబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచాడు. పలువురు సాక్షులను విచారించిన కోదాడ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధించారు. దానిని సవాల్ చేస్తూ నిందితుడు జిల్లా కోర్టులో అప్పీల్ చేసుకోగా, సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ కొవపల్లి లింగయ్య వాదలనతో ఏకీభవిస్తూ ఆ తీర్పునే అమలు చేశారు.

## కుటుంబ సభ్యులు మందలించారని..

- ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


సతీష్‌కుమార్ (ఫైల్)

**వలిగొండ :** కుటుంబ సభ్యులు మందలించారని ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వలిగొండ మండల పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన పసల సతీష్‌కుమార్ (24) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా సతీష్‌కుమార్ మద్యానికి బానిసగా మారాడు. ఈ విషయంలో సతీష్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సతీష్‌కుమార్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం తండ్రి బాలస్వామి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా సతీష్‌కుమార్ చెట్టుకు వెలాడుతూ విగతజీవుడిగా కనిపించాడు. సమాచారం మేరకు గ్రామస్తులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య భాగ్యరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

## బైక్‌తో సహా సజీవదహనం

- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్న పోలీసులు
- మృతుడు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ వాసి


నాగరాజు (ఫైల్)

**భువనగిరి క్రైం :** ఓ వ్యక్తి బైక్‌తో సహా సజీవదహనమయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు(39) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. నాగరాజు కొన్నేళ్లుగా మధుమేహంతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నాడు. నాగారాజు సోమవారం తెల్లవారుజామున బైక్‌పై భువనగిరి మండలం అనంతారం గ్రామలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అనంతరం బైక్‌తో పాటు వ్యక్తి తగలబడిపోతుండడాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అప్పటికే నాగరాజు విగతజీవుడిగా మారాడు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడు నాగరాజుగా గుర్తించారు. బైక్‌ను తగులబెట్టి ఆపై తానూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. మృతుడి బంధువు సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

### పోగొట్టుకున్న పర్సు అప్పగింత


బాధితుడికి పర్సు అందజేస్తున్న డీఎస్పీ ప్రకాష్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

**కోదాడరూరల్ :** పోగొట్టుకున్న పర్సును బాధితుడికి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు.. ఓ రిటైర్డ్ టీచర్. కోదాడ పట్టణానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం శెట్టి వెంకటేశ్వర్లుకు రోశమ్మగారి వీధిలో ఓ పర్సు దొరికింది. ఆ పర్సును డీఎస్పీ కార్యాలయంలో అందజేసి పరిశీలించగా రూ.3,520 నగదుతో పాటు ఆధార్, పాన్ కార్డు పలు విలువైన పత్రాలు ఉన్నట్లు గుర్తించారు. పర్సులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఒడిశా నుంచి జీవనోపాధికి వచ్చిన షేక్.ఆరీఫ్‌దిగా గుర్తించారు. అతన్ని స్టేషన్‌కు పిలిపించి డీఎస్పీ ప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. దీంతో నిజాయితీ చాటుకున్న వెంకటేశ్వర్లును డీఎస్పీతో పాటు పలువురు అభినందించారు.

## ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- యాదాద్రి భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి


విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి

**భువనగిరి :** భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఈ నెల 3వ తేదీన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న గదిని సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. వార్డెన్ సంఘటన జరిగిన సమయంలో హాస్టల్‌లో లేకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న సమయంలో బెడ్ పక్కనే ఉన్నా సపోర్ట్ తీసుకోకపోవడం అనుమానంగా ఉందన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హాస్టల్‌లో జరిగిన సంఘటనలో వార్డెన్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. హాస్టల్ గదుల్లో అశ్లీల వ్యాఖ్యలు కనిపించడం, వార్డెన్ పర్యవేక్షణ చేయడం లేదని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలన్నారు. అంతకు ముందు ఎస్సీ వసతి గృహాల డివిజనల్ ఆఫీసర్ వసంతతో పాటు సిబ్బందితో సంఘటనలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట జెడ్పీటీసీ బీరు మల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

### మట్టపల్లిలో నిత్య కల్యాణం

**మఠంపల్లి:** మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం చేసి స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కళ్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ చేశారు. క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న 18 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి కోటాచలం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2020 వరకు ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి ఉండాలని, జీఎన్‌ఎం ఆరు నెలల సర్టిఫికెట్ గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 12వ తేదీన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు. దరఖాస్తు కోసం రూ. 250 ఫీజుతో మెడికల్ ఆఫీస్ కార్యాలయం పేరు మీద డీడీ తీయాలన్నారు.



# ప్రభుత్వ మద్దతుకు మించి..


తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ రాశులు


తిరుమలగిరి మార్కెట్‌లో కందుల రాశులు

- కంది, వేరుశనగ పంటలకు రికార్డు స్థాయిలో ధరలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

**తిరుమలగిరి (తుంగతుర్తి):** ప్రస్తుత సీజన్‌లో వేరుశనగ, కంది పంటలకు మద్దతుకు మించి ధరలు పలుకుతున్నాయి.తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు పదిహేను రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి వేరుశనగ కాయ వస్తుంది. ఇప్పటి వరకు 2,434 క్వింటాళ్ల కాయ మార్కెట్‌కు వచ్చింది. అయితే వేరుశనగ క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.6,377 ఉండగా గరిష్టంగా క్వింటాకు రూ.8,630, కనిష్టంగా రూ.6వేలకుపైగా ధర పలుకుతోంది.మార్కెట్‌కు వేరుశనగ కాయ భారీగా రావడంతో ప్రజలతోపాటు వ్యాపారులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో వేరుశనగ కాయకు మంచి డిమాండ్ ఏర్పడి రోజురోజుకూ ధర మరింత పెరుగుతూనే ఉంది. గతంలో కంటే వేరుశనగ కాయ సాగు తగ్గినా మద్దతు ధర కంటే అధిక ధరలు పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కందులకు రికార్డు ధర**

కంది సాగు చేసే రైతులకు కూడా ఈసారి మంచి ధరలే వస్తున్నాయి. గత నెల రోజులుగా వ్యవసాయ మార్కెట్‌కు భారీగా కందులు వస్తున్నాయి. ప్రస్తుతం కందులకు మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7 వేలు తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ప్రతిరోజు మద్దతు ధర కంటే అధికంగానే ధరలు వస్తున్నాయి. శుక్రవారం క్వింటాళ్‌కు గరిష్టంగా రూ.10217 ధర పలికింది. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ స్థాయిలో ధర రాలేదని రైతులు, వ్యాపారులు తెలుపుతున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటి వరకు 4971 క్వింటాళ్ల కందులు వచ్చాయి. గరిష్టంగా క్వింటాళ్‌కు రూ.10217, కనిష్టంగా రూ.8160 ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కంది పప్పు కేజీ రూ.150 కంటే అధికంగా ఉండటంతో ఈసారి కందులకు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధరలు చోటు చేసుకుంటున్నాయి.కందులకు ప్రభుత్వ మద్దతు ధర కంటే అధిక ధరలు వస్తుండటంతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు.

**ఇబ్బందులు పడుతున్నాం**

గతంలో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో వేసేవాళ్లం. కొన్నేళ్లుగా కోతుల బెడద అధికంగా ఉండటంతో వేరుశనగ పంట వేయలేక పోతున్నాము. ఈసారి రెండు ఎకరాలలో వేరుశనగ పంట వేశాను. ఉదయం నుంచి రాత్రి వరకు కుటుంబ సభ్యులమందరమూ కాపలా ఉన్నాము. మార్కెట్‌కు వేరుశనగ తీసుకొస్తే క్వింటాళ్‌కు రూ.7900 ధర వచ్చింది.

– వెంకటయ్య, వెలిశాల, తిరుమలగిరి మండలం


**మంచి ధర పలికింది**



తిరుమలగిరి మార్కెట్‌కు 10 క్వింటాళ్ల కందులు తీసుకొచ్చా. క్వింటాళ్‌కు రూ.10217 ధర వచ్చింది. గతంలో ఎన్నడు కూడ కందులకు ఈ ధర రాలేదు. చాలా సంతోషంగా ఉంది.

– గుగులోతు భద్రు, వెంపటి, తుంగతుర్తి మండలం

**రూ.80 కిలో చొప్పున కొనుగోలు చేశారు**



మార్కెట్‌లో వేరుశనగ కాయను కేజీకి రూ.80 చొప్పున కొనుగోలు చేశారు. ఇంటి అవసరాలకు ప్రతి సంవత్సరం మార్కెట్‌లోనే 30కేజీల వేరుశనగను కొనుగోలు చేస్తారు. మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ కాయ నాణ్యతగా ఉంటుంది.

– సాయికుమార్, తిరుమలగిరి